




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 193 శనివారం 19-07-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


### హైదరాబాద్‌లో కల్లు నిషేధిస్తే

## నగర దిగ్బంధనమే

**ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక**

**కల్లును నిషేధిస్తే మద్యనిషేధానికి ఉద్యమం: గౌడ సంఘం**



**పంజాగుట్ట, జూలై18:** హైదరాబాద్‌లో కల్లును నిషేధిస్తే లక్షలాది మందితో నగరాన్ని దిగ్బంధం చేస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గిన ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కల్లు గీత వృత్తిపై దాడి చేస్తోందని ఆరోపించారు. గౌడ సంఘాల నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2004లో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లో కల్లు విక్రయాలను నిషేధించగా ఎంతోమంది గీత కార్మికులు రోడ్డున పడ్డారని శ్రీనివాసగౌడ్ తెలిపారు. కూకట్‌పల్లిలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు, కార్పొరేటర్ ఆధ్వర్యంలో నడుస్తున్న కల్లు కాంపౌండ్‌లో కల్తీ కల్లు తాగి 11 మంది చనిపోయారన్నారు. ఆ కాంపౌండ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోకుండా ఓఅర్ఆర్ లోపల కల్లు అమ్మకాలు బంద్ చేస్తామని ప్రభుత్వం లీకేజీలు ఇస్తుందని మండిపడ్డారు. కల్తీకి తాము వ్యతిరేకమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఇక, కల్తీ పేరుతో ప్రభుత్వం తమ జాతిని అంతం చేయాలని చూస్తోందని గౌడ్ సంఘాల నాయకులు ఆరోపించారు. తమ సామాజిక వర్గానికి చెందిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ అంశంపై స్పందించకపోతే జాతి ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు.



# పదేళ్లూ నేనే..!

## పాలమూరు బిడ్డ సీఎంగా ఉండడం ఖాయం.. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

**కొల్లాపూర్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**

**మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్, జూలై18** పాలమూరు బిడ్డనైన తాను పదేండ్ల వరకు సీఎంగా ఉండడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. "కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. ప్రతిపక్షంలో కూర్చోవాలి. మేం చేసే మంచి పనుల గురించి చెబుతుంటే నువ్వు కుమిలి కుమిలి ఏడవాలి. అందుకే ఆయన్ను అసెంబ్లీకి పిలుస్తున్నాం" అని చెప్పారు. కేసీఆర్ కడుపులో మంట పెట్టుకొని కళ్లల్లో నీళ్లు కారుస్తున్నాడని, కడుపులో విషం ఉంటే ఆరోగ్య సమస్యలు వచ్చి ఆస్పత్రిపాలు కావాల్సి వస్తుందని విమర్శించారు. కడుపులో విషం ఉంటే కోసి తీసివేస్తారని అన్నారు. నాగర్కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోలులో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి శుక్రవారం సీఎం శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,52,635 మంది మహిళలకు రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. అనంతరం జరిగిన 'ప్రజా పాలన – ప్రగతి బాట' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. కేసీఆర్ శాపగ్రస్తుడని, బావిలో దుంకినా.. పెట్రోల్ పోసుకొని అంటించుకున్నా తెలంగాణ అభివృద్ధిని ఆపలేరన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం నిరుద్యోగ యువకులు ప్రాణ త్యాగాలు చేశారని, రెండు లక్షల కొలువులు ఖాళీ ఉంటే కేసీఆర్ తన ఇంటినిండా కొలువులు ఇచ్చుకున్నాడే తప్ప నిరుద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు.

### గోదావరిపై మీ కార్యాచరణ ఏంటి?

**ఎప్పుడూ కేంద్రాన్ని విమర్శించడమేనా**

**రేవంత్ రెడ్డికి కిషన్‌రెడ్డి ప్రశ్న**



**హైదరాబాద్, జూలై 18** గోదావరి మిగులు జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ఏమిటో చెప్పాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. "మీ కంటే ఆరు నెలల తర్వాత చంద్రబాబు ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదించారు. గడచిన రెండేళ్లలో మీరేం చేశారు" అని నిలదీశారు. "ఎంతసేపూ కిషన్‌రెడ్డి ఏం చేశారు. ప్రధాని మోదీ తెలంగాణకు ఏమిచ్చారు.. అంటూ పడికట్టు పదాలతో అబద్ధాలు వల్లె వేయడం తప్పితే రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నిర్మాణాత్మక చర్య కూడా చేపట్టలేదు" అని ఆయన దుయ్యబట్టారు. శుక్రవారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "బనకచర్లపై నేను ప్రధాని మోదీని కలుసుకున్నా. మూడుసార్లు జలశక్తి శాఖ మంత్రితో భేటీ అయ్యా. బనకచర్ల సమస్యకు పరిష్కారం చూపించాలని కోరాను.

### హాస్య నటుడు.. ఫిష్ వెంకట్

## కన్నుమూత



హాస్య నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూశారు. ఎన్నో చిత్రాల్లో తనదైన శైలి హాస్యంతో టాలీవుడ్ ప్రేక్షకుల్ని అలరించిన ఆయన శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. వి.వి. వినాయక్ సినిమాల ద్వారా పాపులర్ అయిన అయన దాదాపు నాలుగేళ్లగా కిడ్నీల సమస్యతో బాధ పడుతున్నారు. తన రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ ద్వారా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం బోడుప్పల్‌లోని ఆర్బీఎం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. రెండు కిడ్నీలని మార్పిడి చేయాలని, ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉందని వైద్యులు చెప్పినట్లు ఇటీవల ఆయన కుమార్తె స్రవంతి తెలిపిన సంగతి తెలిసిందే! వైద్య సేవలకి ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నామనీ, దాతలు ఎవరైనా సాయం చేయాలని ఆమె కోరారు. జెట్టి సినిమా హీరో కృష్ణ మానినేని వంటి వారు ఆర్థిక సాయం అందించారు. అయినా సర్జరీకి సరిపడ డబ్బు సమకూరలేదు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో శుక్రవారం రాత్రి ఫిష్ వెంకట్ తుది శ్వాస విడిచారు.

# మంత్రుల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారు

## భట్టి, పొంగులేటి, ఉత్తమ్ తన సీటుకు ఎసరుపెడతారని సీఎం రేవంత్ భావిస్తున్నారు

**మా ఫోన్లు సహా వేలాది ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి**

**దమ్ముంటే లైడిటెక్టర్ పరీక్షలకు రావాలి**

**నేను లోకేశ్‌ను కలవలేదు.. కలిస్తే తప్పేంటి?: కేటీఆర్**

**హౌలే, నికృష్టుడు, పెంటపురుగు, ఏం పీకావ్, మగాడివైతే రా.. అంటూ సీఎంపై పరుష పదజాలం**

**తెలంగాణలో చిల్లర పోలీసింగ్ నడుస్తోంది!**

**ఒక్కొక్కడిని ఏం చేయాలో రాసిపెడ్తున్నం: కేటీఆర్**



**మల్కాజ్‌గిరి, జూలై 18:** తన సీటుకు ఎవరు, ఎలా ఎసరుపెడతారోనని చెప్పి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌ల ఫోన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో తమ ఫోన్లు సహా వేలాది ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని.. దీనిపై లైడిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా? మగాడివైతే రా అని సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి 'హౌలే, నికృష్టుడు, పెంటపురుగు, ఏం పీకావ్, పిచ్చివాగుడు..' అంటూ పరుష పదజాలంతో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌ల పేరుతో రోత డైలాగులు చెప్పడంలో, బూతులు మాట్లాడటంలో ప్రసిద్ధుడని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి లాంటి నీచపు సీఎంను ఎప్పుడూ చూడలేదు. చిట్‌చాట్‌ల పేరుతో తప్పుడు లీకులు, సోషల్ మీడియాలో తప్పుడు తంబ్‌నెయిల్‌లు, అబద్ధపు, డైవర్షన్ రాజకీయాలతో 18 నెలల పాలన సాగించిన ఘనుడు. రేవంత్‌రెడ్డి నోటి నుంచి ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా–ఈ, కాళేశ్వరం, కేసీఆర్.. ఇలా నికృష్టపు మాటలు తప్ప మరేమీ రావు. ఆ మాటలు, స్పీచ్‌లను చూసి ప్రజలు మోసపోవద్దు. డ్రగ్స్ మనుషుల ప్రాణాలు ఎలా తీస్తాయో.. రేవంత్‌రెడ్డి మాటలు రాష్ట్ర ప్రజల ప్రశాంతతను, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. చిల్లర గాసిప్ వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానల్స్‌కే తప్ప ప్రజలకు రేవంత్‌రెడ్డితో దమ్మిడీ లాభం లేదు" అని వ్యాఖ్యానించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, రోశయ్య వంటివారు సీఎం పదవికి హుందాతనం తెచ్చారని, కానీ రేవంత్ నికృష్ట పాలన చేస్తున్నారని విమర్శించారు. అధికారం ఉందని ఇష్టమొచ్చినట్టు కేసులు పెట్టారని, కానీ లీకులివ్వడం తప్ప పీకేదేమీ లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "అధికారికంగా ఏమీ చెప్పకుండా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. గ్రాఫిక్స్‌తో నాన్సెన్స్ సృష్టిస్తున్నారు. కిట్టీపార్టీ ఆంటీలా గాసిప్స్ సృష్టిస్తున్నారు.

### రేవంత్‌ను గద్దె దించి

## బీసీ వ్యక్తిని సీఎం చేయాలి

**బీసీ రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉంది: రాంచందర్‌రావు**



**మెదక్, జూలై 18:** కాంగ్రెస్ పార్టీకి బీసీలపై అంత ప్రేమ ఉంటే సీఎం రేవంత్‌ను గద్దె దించి బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మెదక్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మెదక్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో ప్రసంగించారు. కేంద్ర క్యాబినెట్‌లో 23 మంది బీసీ మంత్రులు ఉన్నారని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికొదిలేసి ఢిల్లీకి చెక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

### బాలలకు రక్తపరీక్షలు..

**హైదరాబాద్, జూలై 18 :** రాష్ట్రంలోని అంగన్‌వాడీల్లోని చిన్నారులు, ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పిల్లలందరికీ రక్త పరీక్షలు చేయాలని సర్కారు నిర్ణయించింది. పిల్లలు వయసుకు తగిన ఎత్తు, బరువు పెరగడంలేదని, వారిలో ఎదుగుదల సరిగా ఉండడంలేదని పలు నివేదికలు పేర్కొంటున్న నేపథ్యంలో వారి ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ చిన్నారుల నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు బాల, బాలికలందరికీ రక్త పరీక్షలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

# కుండపోత

## హైదరాబాద్‌లో భారీవర్షం.. నగరం అతలాకుతలం

**మల్కాజ్‌గిరి, జూలై 18:** కొద్దిరోజులుగా వచ్చీ రానట్లు పలకరించి పోతున్న వరుణుడు.. శుక్రవారం ఒక్కసారిగా విజృంభించాడు. ప్రత్యేకించి రాజధాని హైదరాబాద్ నగరాన్ని కుండపోతతో వణికించాడు. మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 7గంటల వరకు నగరంలో వాన.. దంచికొట్టింది. మారేడ్‌పల్లి పికెట్‌లో అత్యధికంగా 11.4 సెంటీమీటర్లు, బోయిన్‌పల్లిలో 11.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు కురిసిన అత్యధిక వర్షపాతం ఇదేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. భారీ వర్షం కారణంగా వచ్చిన వరదలతో గ్రేటర్‌లో లోతట్టు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. ప్రధాన రహదారులను వరదలు ముంచేయడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

రోడ్లపై ఎక్కడికక్కడ తీవ్ర ట్రాఫిక్ జాం అయింది. సాయంత్రం విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు 2–3 గంటలపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కొని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉప్పల్, మల్కాజిగిరి, బండ్లగూడ, ముషీరాబాద్, కుత్బుల్లాపూర్, బండ్లగూడ, అంబర్‌పేట, హిమాయత్‌నగర్, సైదాబాద్, రాజేంద్రనగర్, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులు ఏకంగా చెరువులను తలపించాయి. ముసారాంబాగ్ బ్రిడ్జిపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



# “మహిళ ఆర్థిక స్వేచ్ఛ,సంక్షేమమే” ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యం

**మహిళలకు ఈ ప్రభుత్వ హయాంలో ప్రతిరోజు బతుకమ్మ పండుగే,**

**మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి - శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్**



**తొలి సమయం, మహబూబాబాద్ జులై 18:** శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని యశోద గార్డెన్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు, బ్యాంకు లింకేజ్, రుణాలు లోన్ బీమా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు. మహిళలను కొటీశ్వరుల్ని చేయడమే లక్ష్యమని అన్నారు. ఇందులో భాగంగా మహిళలకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల, బస్సులు, పెట్రోల్ పంపుల నిర్వహణ బాధ్యత, అప్పగించి వారికి తోడ్పాటు నందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ నియోజకవర్గంలో 4 మండల సమాఖ్యలు, 204 గ్రామా సంఘాలు, 5243 స్వయం సహాయక బృందాలకు 55,278 మంది సభ్యులతో ఏర్పాటు చేయడం జరిగింది. బ్యాంకు లింకేజి ద్వారా (3033) గ్రూపులకు 241.58 కోట్ల రూపాయల ఋణాలు మంజూరి (10652) గ్రూపులకు 11.58 కోట్ల రూపాయల వడ్డీలేని ఋణాలు మంజూరి చేయడమైనదని, 2410 ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు చేయడమైనదని, 4 ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ లు ఏర్పాటు చేయడమైనదని 1 మిల్క్ పార్లరు, మొబైల్ ఫిష్ విక్రయ కేంద్రం ఏర్పాటు చేయడమైనదని, 1 ఆర్.టి.సి బస్సు మహబూబాబాద్ మండలానికి మంజూరి అయినదని నెలకు రూ. 69,468/- అద్దె సంబంధిత మండల సమాఖ్యకు చెల్లించుట జరుగుతున్నదని, (35,206) స్కూల్ యూనిఫాంలు (241) మంది మహిళా టైలర్లతో కుట్టించడం జరిగిందని, లోన్ బీమా క్రింద (31) క్లెయిమ్ లకు గాను 27.43 లక్షల రూపాయలు మంజూరి చేయడమైనదని, సంఘ సభ్యురాలు ఏదైనా కారణంచే చనిపోయిన ఆమె అప్పు గరిష్టంగా 2.00 లక్షల వరకు మాఫీ చేయబడునని ప్రమాద భీమా క్రింద (4) క్లెయిమ్ కు గాను రూ.40.00 లక్షలు మంజూరి చేయడమైనదని (సంఘ సభ్యురాలు ప్రమాదవశాత్తు చనిపోయిన / శాశ్వత అంగవైలక్యం (100%) జరిగితే, రూ.10.00 లక్షల వరకు మంజూరిచేయబడునని అమ్మ ఆదర్శ పాటశాల కమిటి చైర్మన్ గా మహిళా సంఘ సభ్యులను నియమించి (34) స్కూల్లలో 2.98 కోట్ల రూపాయలకు సంబంధించిన నిర్మాణ మరియు నిర్వహణ పనులను అప్పగించడం జరిగిందన్నారు. 14 మార్కెటింగ్ సెంటర్ల ద్వారా రభీ- 2025 సీజన్లో 1.54 లక్షల క్వింటాళ్ళ వడ్లు కొనుగోలు చేయడం ద్వారా 50.84 లక్షల రూపాయలు కమిషన్ పొందడం జరిగినదని అన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఆర్డిఓ కృష్ణవేణి, డి.ఆర్.డి.ఓ మధుసూదన రాజు, స్థానిక తహసిల్దార్ రాజేశ్వర్, ఎం.పి.డి.ఓ తదితరులు పాల్గొన్నారు.

# “నెల్లి కుదురు మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ”

**- లో భాగంగా కలెక్టర్ సుడిగాలి పర్యటన**

**- ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ,అంగన్వాడి కేంద్రాల్లో పరిశీలన**

**- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**తొలి సమయం మహబూబాబాద్ జూలై 18:** శుక్రవారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ జిల్లా నేల్లికుదురు మండలంలో అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. నెల్లికుదురు మండలంలో కేజీబీవీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిసరాలను,రికార్డులను పరిశీలించారు.విద్యార్థినీ, విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలు ఫలితాలు, విద్య బోధనలపై పరిశీలన చేశారు. 2025-2026 విద్యా సంవత్సరంలో మహబూబాబాద్ జిల్లాలోని అన్ని కేజీబీవీ లలో విద్యార్థుల అభ్యసనా స్థాయిలను పెంచడం కోసం ఈ క్రింది వినూతన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు అందులో భాగంగా1. ఖాన్ అకాడమీ 2. ఫిజిక్స్ వాలా 3. ఐ ఐ టీ -నీట్ శిక్షణ తరగతులు 4. సైకిల్ పార్ట్ టెస్టులు5. న్యూ మెనూ విద్యార్థుల బోధన అభ్యసన కోసం ఐఎఫ్ పి ఉపయోగించడం ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని ప్రతి కేజీబీవీ కి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం ద్వారా ఆన్లైన్ పాఠలు వినిపించడం జరుగుతు ందన్నారు. ప్రతి కేజీబీవీ లో ఉన్నటువంటి రిపేర్లను సరి చేయడం కోసం సివిల్ వర్క్స్ వేగవంతంగా జరుగుతున్నాయని, సివిల్ వర్క్స్ ద్వారా అన్ని కేజీబీవీ లలో అవసరమైన విద్యుత్తు పరికరాలతో పాటు శానిటేషన్ రిపేరు చేయడం జరుగుతుందని, వంటశాలలకు అవసరమైన టువంటి అన్ని రకాల సౌకర్యాలు సిద్ధంగా ఉంచుకో వాలన్నారు, విద్యార్థులు శారీరక వ్యాయా మం చేయడానికి అవసరమైనటువంటి స్పోర్ట్స్ మెటీరియల్ అధునాతనమైనటువంటి డ్యుయల్ డెస్కులు సమకూర్చడం ఈ వసతులన్నీ సద్విని యోగం చేసుకుంటూ గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో కేజీబీవీలు SSC ఫలితాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలి చాయి ఈ సంవత్సరం కూడా ప్రథమ స్థానంలో రావడం కోసం ప్రారంభం నుంచే బోధనా అభ్యసన ప్రక్రియలు వినూత్న కార్యక్రమాలను సమర్థవంతంగా వినియోగించడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా నెల్లికుదురు కె.జి.బి.వి, ఉన్నత పాతశాలను సందర్శించి స్టోర్ గదిని, సరకుల నిల్వను ప్రత్యేకంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల యొక్క విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. వంట శాలను పరిశీలించి పరిశు



భ్రమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. నెల్లికుదురు అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి భోదనను పరిశీలించారు. నూతన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు, అనంతరం పి.హెచ్.సి సందర్శించి రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాదులకు తగిన అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పేషెంట్ లకు అవసరమయ్యే ల్యాబ్ టెస్టులను చేయించాలని, నిత్యం వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరి వైద్య రిపోర్టులను సిద్ధం చేయాలని సూచించారు,ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ జేయూ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పోచంపల్లి రజిత

**బచ్చన్నపేట, జులై 18 తొలి సమయం న్యూస్** టీఎస్ జేయూ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన జర్నలిస్ట్ పోచంపల్లి రజిత శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జనగామ జిల్లా అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్ ప్రతిపాదన మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నారగౌని పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆమె ఎన్నికను ప్రకటించారు. రజితతో పాటు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కు చెందిన జర్నలిస్ట్ తాటికొండ రజనిని ఎన్నుకున్నారు. అలాగే టీఎస్ జెయు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మాట్ల సంపత్, కార్యవర్గ సభ్యులుగా గంద్రాతి విజయాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రజిత శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం అప్పగించి



బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ యుజె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు పావుశెట్టి శ్రీనివాస్, నాగపురి నాగరాజ్, అన్ని జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, జర్నలిస్ట్ నేతలు పాల్గొన్నారు.

# యూరియా, ఫర్టిలైజర్స్, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

**జిల్లా (ఇన్చార్జి) వ్యవసాయ శాఖ అధికారి అజ్మీరా శ్రీనివాసరావు**



**తొలి సమయం మహబూబాబాద్ జులై 19:** శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని రైతు వేదికలో జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ మండల విస్తరణ అధికారులు సంబంధిత అధికారులతో కలిసి ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలు అమలుపై శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే కార్యక్రమాలు పథకాల అమలుకు క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ రైతు భరోసా, రైతు బీమా, ఫార్మర్ రిజిస్ట్రీ విత్తనాల మినీ కిడ్స్ పంపిణీ, విత్తన ఉత్పత్తి కింద ఇవ్వబడిన మేలైన కిడ్స్ తదితర కార్యక్రమాల పట్ల రైతులకు సేవలు అందించాలనీ సూచించారు, మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు ,పురుగుల మందుల దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి యూరియా, డిఏపి, పొటాష్, సింగల్ సూపర్ ఫాస్ట్, తదితర ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించారు, జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవ కేంద్రాలలో ప్రైవేటు డీలర్స్ దగ్గర ఉన్న యూరియా, డిఏపి, పొటాష్, సింగల్ సూపర్ ఫాస్ట్, ల స్టాక్ లను తనిఖీ చేస్తూ ఉండాలని, ఎవరైనా అధిక ధరలు ,కల్తీ విత్తనాలు ఎరువులు, అమ్మిన యెడల ప్రభుత్వం సూచించిన ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు,టెక్నికల్ ఏవో విజ్ఞాన్, మోహన్ రాజు, జావిద్ ఖాన్, టెక్నికల్ ఏ డి ఏ మురళి, ఏడిఏ విజయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు బిఆర్ఎస్ పార్టీకి

# ఎలాంటి సంబంధం లేదు

**బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యనాథ్**



**బచ్చన్నపేట జూలై 18 తొలి సమయం న్యూస్** పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వని బి ఆర్ ఎస్ నాయకుల్లారా. ఏం చేశారని పల్లా రాజేశ్వర్ రెడ్డి కి కేసిఆర్ కు పాలాభిషేకం చేశారు. పది సంవత్సరాల్లో పేద వర్గాన్ని పట్టించుకోని బిఆర్ఎస్ ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ నాయకులు జనగామ ప్రాంత అభివృద్ధి ప్రదాత డిసిసి అధ్యక్షులు కొమ్మూరు ప్రతాపరెడ్డి చొరవతో జనగామ నియోజకవర్గంలో ప్రతి పేదవాడి సొంతింటి కల సహకారం చేసే విధంగా ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి పేదవాడి కల నెరవేర్చింది. దానికి టిఆర్ఎస్ నాయకులు కేసీఆర్ కు పాలాభిషేకం చేయడం సిగ్గుచేటు.. మండల ప్రజలందరూ అన్ని గమనిస్తున్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేస్తారు.. అని బచ్చన్నపేట మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగిటి విద్యానాథ్ అన్నారు..

# వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించిన కోడూరి



**బచ్చన్నపేట జులై 18 తొలి సమయం న్యూస్** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన చెవుల ప్రవీణ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా విషయం తెలుసుకొని ఆర్విఎం ఆసుపత్రికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నేనున్నానని మనోధైర్యం చెప్పి వైద్య ఖర్చులకు గాను 5000 ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన కోడూరు శివకుమార్ గౌడ్ డ్రైవర్ వృత్తి చేసుకుంటూ రేక్కాడితే గాని డొక్కాడని ప్రవీణ్ కు ఆర్థిక సాయం అందించినందుకు గాను శివకుమార్ గారికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు పరామర్శించిన వారిలో వంచ వెంకట్ రెడ్డి ఎలికట్ట శ్రీనివాస్ గౌడ్ కందుకూరి కనకరాజు తదితరులు ఉన్నారు

# తొర్రూర్ మండలంలో బాధిత కుటుంబాలను పరామర్శించినటీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి



**తొలి సమయం తర్వాత రోజులై 18** తోరూర్ మండలం పోలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గండు అండమ్మ గారికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో వారిని పరామర్శించడం జరిగిందితదనంతరం తొర్రూర్ మండల యూత్ అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ తాత పయ్యావుల ఐలయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగిందిఈ కార్యక్రమంలో తొర్రూర్ మండల నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, సోషల్ మీడియా నాయకులు, Nsui నాయకులు, తదితరులు, పాల్గొన్నారు..

# రాష్ట్ర మంత్రివర్యులు వాకిట శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసిన పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.

**తొలి సమయం పెబ్బేర్**



వనపర్తి పట్టణ కేంద్రానికి గురువారం రోజు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల నిమిత్తం వనపర్తి పట్టణ కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య,స్పోర్ట్స్ శాఖ మాత్యులు శ్రీ వాకిట శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా బొకేతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ రాంపురం సహదేవుడు ఆనంద్ సాగర్ ఎల్లాస్వామి నాయుడు విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెర్లపాలెం-గోపాలగిరి ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం

## పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి



**తొలి సమయం తొర్రూరు జూలై 18**
తొర్రురు మండలం చెర్లపాలెం గ్రామంలో జరిగిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం ఎంతో ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ని గ్రామస్తులు స్వాగతించారు. డీజే సప్పులతో, పూల హారాలతో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని వారికి గౌరవాన్ని చాటారు.. ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.గోపాలగిరి, చెర్లపాలెం గ్రామాలు నా రెండు కండ్లు లాంటివి. నా జీవితానికి, రాజకీయ ప్రస్థానానికి బీజం పడిన ప్రదేశాలు ఇవే. ఐదు తరాలుగా మా హనుమాండ్ల కుటుంబం ఈ ప్రాంతానికి సేవలందిస్తోంది. ఈ సేవా పథం ఇకపై మరింత శక్తిగా కొనసాగుతుంది అని ఉద్వేగభరితంగా వ్యాఖ్యానించారు..నా సొంత గ్రామమైన చెర్లపాలెం, గోపాలగిరి కి రావడం ఎంతో గర్వకారణం. మన గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే నా లక్ష్యం. ఇందుకోసం నా కోడలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో సమష్టిగా పనిచేద్దాం. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే మనందరిమీద ఉన్న బాధ్యత అని ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో బ్లాక్ మరియు మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం గ్రామస్థులతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్న ఝాన్సి రాజేందర్ రెడ్డి , స్థానిక సమస్యలపై చర్చిస్తూ వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు..గ్రామాభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే తన ప్రథమ లక్ష్యమని పేర్కొంటూ, ప్రజల ఆదరణతో ముందుకు సాగుతానని వారు స్పష్టం చేశారు..

# చిరు దాన్యాలు సేంద్రియ ఎరువులతో పండించాలి

## జీవన్ ఆధార్ సొసైటీ డైరెక్ట్ ర్ సాక్ర బాయి

**తొలి సమయం, ఇనుగుర్తి జులై 18:**
చిరు దాన్యాలను సేంద్రియ ఎరువులతో పండించాలి అని జీవన్ ఆధార్ సొసైటీ డైరెక్టర్ సాకృబాయి అన్నారు అయ్యగారు పెల్లి గ్రామం లో జీవన్ ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ హిత వ్యవసాయ పద్ధతులు శిక్షణా ప్రణాళిక గురించి చర్చించారు ఈ సందర్భంగా డైరెక్ట్ మాట్లాడుతూ.. చిరుధాన్యాలను సేంద్రియ ఎరువులతొ పండించాలి అన్నారు కాషాయాల కోసం గ్మోరీత్రం ప్రాముఖ్యత ను వివరించారు, చిరు దాన్యాలతో అనేక రకాల తిను బంధారాలు తయారు చేసుకోవొచ్చును అన్నారు ట్రైనింగ్ ఇస్తే మేమే తయారు చేసుకుంటాం అన్నారుఆడ పిల్లలు మహిళల పై మహిళల పై జరుగుతున్న దారుణాలు ఎక్కువ అయ్యాయి అన్నారు. పిల్లలను డైరెక్ట్ చెయ్యడం లో కుటుంబ పాత్ర ఉంటుంది అన్నారు.. ఈ కార్యక్రమం లో ఏం మంజుల కమల దేవమ్మ, రమ, నర్సమ్మ, జయ పాల్గొన్నారు



# మాడవీధుల విస్తరణ పనులు వేగవంతం చేయాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**తొలి సమయం రాత్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జూలై 18**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న మాడవీధుల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం భద్రాచల పర్యటనలో భాగంగా మంత్రి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాడవీధుల అభివృద్ధి ప్రణాళిక, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరంమంత్రి మాట్లాడుతూ, భద్రాచల రామాలయం రాష్ట్రానికి ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాధాన్యమున్న స్థలం. ఇక్కడికి వేలాదిగా భక్తులు వస్తారు. వారి కోసం చేపడుతున్న మాడవీధుల విస్తరణను ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు. పనులు వేగవంతంగా పూర్తి చెయ్యాలి అని అన్నారు.మాడవీధుల విస్తరణలో భాగంగా పరిహారం ఇచ్చిన ఇండ్లను తక్షణమే తొలగిం చాలని, ప్రజలతో సంప్రదించి శాంతియుతంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీనితో పాటు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఈ ప్రణాళిక భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలకు మార్గదర్శకంగా ఉండేలా రూపొందించాలన్నారు .మంత్రి పర్యటనలో జిల్లా అధికారులు, పంచాయతీ సిబ్బంది, ఆలయ ప్రతినిధులు, వివిధ శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.

# మెగా ఆధార్ క్యాంపులకు ప్రజల నుండి విశేష స్పందన

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**తొలిసమయం భద్రాద్రి కొత్తగూడెం జూలై 18**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఆధార్ క్యాంపులకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 9 నుండి జూలై 17, వరకు నిర్వహించిన మెగా ఆధార్ క్యాంపుల్లో మొత్తం 6,159 మంది తమ ఆధార్ నమోదు, సవరణలు వంటి సేవలను పొందారని తెలిపారు. ఇందులో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన క్యాంప్‌లో అత్యధికంగా 3,772 మంది, భద్రాచలం క్యాంప్‌లో 801 మంది, ఇల్లందులో 714 మంది, మణుగూరులో 525 మంది, దమ్మపేటలో 347 మంది పాల్గొన్నారు. అన్ని క్యాంపులకు కలిపి మొత్తం 3,500 ఫిర్యాదులు స్వీకరించబడి పరిష్కారానికి చర్యలు చేపట్టబడ్డాయి అన్నారు.ప్రజలు ఇంకా ఆధార్ సవరణలు లేదా ఆధార్ ఆధారిత సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయాలి అంటే తమ మండలాల్లోని ఆధార్ సేవా కేంద్రాలను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచిస్తున్నారు. ప్రస్తుతం




దుమ్ముగూడెం, చర్ల, గుండాల, దమ్మపేట, మణుగూరు, భద్రా చలం, ఇల్లందు, టేకులపల్లి, ముల్కలపల్లి, అన్నపూరెడ్డిపల్లి, అశ్వాపురం పినపాక, కరకగూడెం, కొత్తగూడెం, పాల్వంచ , సుజాత్ నగర్, చంద్రుగొండ, జూలూరుపాడు, చుం చుపల్లి, లక్ష్మీదేవిపల్లి వంటి మండలాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవలు పంచాయతీ కార్యాలయాలు, %పీణూ% కార్యాల యాలు, బ్యాంకులు, పోస్టాఫీసులు మరియు స్కూల్ ఆధార్ టీంలు ద్వారా లభిస్తున్నాయి. కొన్ని మండలాల్లో త్వరలో ఆధార్ సేవలు ప్రారంభమవుతాయనీ అధికారులు తెలిపారు.స్కూల్ ఆధార్ టీమ్‌కు సంబంధించి ఏవైనా వివరాలు కావాలంటే జిల్లా మేనేజర్ వంశీ (ఫోన్ నంబర్: 7331115024)ను సంప్రదించవచ్చు. ప్రజలకు విజ్ఞప్తి ఏమిటంటే %-% మీ ఆధార్ మీ హక్కు. అందుచేత అవసరమైన అప్డేట్లు తప్పనిసరిగా చేయించుకోవాలి అని ఆధార్ సేవలపై ఫిర్యాదులు, సలహాల కోసం %ఖ×ణూ×% హెల్ప్‌లైన్ నంబర్ 1947 లేదా ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు ను కలెక్టరేట్‌లో సంప్రదించవచ్చు అని కలెక్టర్ తెలిపారు .

# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం మంత్రి పొన్నం ప్రభాకర్



**తొలి సమయం వరంగల్ జూలై 18**
హనుమకొండ నిధుల కొరత ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీలను నెరవేర్చేందుకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.భీమదేవరపల్లి మండలం ములుకనూరులో రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్, స్టీల్ బ్యాంక్ కిట్లను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమని, స్థానంలో స్టీల్ వాడకం పెంచేందుకు స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశామని చెప్పారు.ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు భరోసా నిధులు వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు.

# పెబ్బేరు కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో తేనేటి విందుకు హాజరైన ఎమ్మెల్యే

**తొలి సమయం పెబ్బేర్**



పెబ్బేరు మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ గారి ఇంట్లో శుక్రవారం సాయంత్రం వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు తేనేటి విందుకు హాజరయ్యారుఈ సందర్భంగా ఆయన పెబ్బేరు, పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపాలిటీ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆగని మట్టి, ఇసుక అక్రమ రవాణా అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ జూలై 18**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ కార్యాలయాల ఎదురుగానే మట్టి, ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా పట్టించుకునే అధికా రులే కరువయ్యారు. ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించని సంబంధిత, అధికారుల తీరును చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా సాగుతున్న ఈ అక్రమ దందాలో రోజుకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అక్రమార్కులు ఆదాయం పొందుతున్నారు.ఎదుళ్ల వాగు ఇసుక, మరో పక్క నుంచి మట్టిని బొక్కేస్తున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోకపోతే తామే అడ్డుకుంటామని ప్రజలు హెచ్చరిస్తున్నారు

# మాతృ వియోగులైన రేగా ని పరామర్శించిన కేటీఆర్



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక జూలై 18**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు,పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాతృమూర్తి రేగా నర్సమ్మ ఇటీవలే పరమపదించగా ఈ రోజు వారి స్వగృహంలో కరకగూడెంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రుల పువ్వాడ అజయ్ కుమార్,సత్యవతిరాథోడ్,వనమా వెంకటేశ్వరావు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,రాకేష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే లు మెచ్చా నాగేశ్వరరావు,హరిప్రియ,శంకర్ నాయక్,మరియు నాయకులతో కలిసి నర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# సింగరేణి డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోరం




**తొలిసమయం ,ఇల్లందు. జులై, 18.**
సింగరేణి కార్యాలయంలో సింగరేణి డైరెక్టర్ (పా )గౌతమ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఇల్లందులోని సింగరేణి సమస్యల పైన చర్చించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య,వారి వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మడుగు సాంబమూర్తి, చిట్టి బాబు,ఐఎన్టీయూసీ నాయకులు తదితరులు ఉన్నారు.

# రైస్ మిల్లర్ల యాజమానులతో AMC చైర్మెన్ సమీక్ష సమావేశం

**తొలి సమయం, ఇల్లందు.జులై, 18.**



ఇల్లందురైస్ మిల్లర్ల యజమానలతో ఈ రోజు మార్కెట్ కార్యాలయం నుందు ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైస్ మిల్లులకు ట్రేడింగ్,ప్రాసెసింగ్ కు సంబంధించి తప్పని సరిగా మార్కెట్ నుండి లైసెన్స్ పునరుద్ధరించుకోవాలి అని సుచించారు.అధే విధంగా మార్కెట్ కమిటికి ఆదాయం చెకూర్చేందుకుసహకరించాలని తెలిపారు.ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి సుచిత్ర,సూపర్వైజర్,శ్రీనివాస్,రైస్ మిల్లర్ల యాజమనులు తదితరులు పాల్గోన్నారు.

## కాకతీయ జూ పార్క్‌లో తెల్ల పులి విడుదల

### మంత్రి కొండా సురేఖ



**తొలి సమయం హనుమకొండ జూలై 18**

హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో నిర్మించిన టైగర్ ఎన్‌క్లోజర్‌లో నెహ్రూ జూ పార్క్, హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన తెల్లపులిని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా జంతువులపై సమాచారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన కోడ్‌లు, చాట్‌బాట్, వన మహోత్సవ కార్యక్రమాలను కూడా మంత్రి ప్రారంభించారు. జంతువులను దత్తత తీసుకుని జూ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు.

## 5వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని

**తొలి సమయం వరంగల్ జూలై 18**



వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలోని 5వ డివిజన్ కొత్తూరు జెండాలో రూ.103 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు మరియు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. పనులు త్వరితగతిన ప్రారంభం కానున్నాయని, అభివృద్ధి కోసం ప్రతి డివిజన్‌కి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు భాగస్వాములవుతారని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసిన పెబ్బేరు మండల్ యూత్ కాంగ్రెస్ నాయకులు

**తొలి సమయం పెబ్బేర్**



ఎక్సైజ్ శాఖ మరియూ పర్యటన శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు ని మర్యాదపూర్వకంగా కలిసిన పెబ్బేర్ మండల యూత్ కాంగ్రెస్ జెనరల్ సెక్రటరీ ఎండీ ఆరిఫ్ ,జూపల్లి కృష్ణారావు గారితో మట్లాడం వనపర్తి నియోజక వర్గం లోని కొన్ని సమస్యల గురించి చర్చించడం జరిగింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు

## మండల అభివృద్ధి కీ కృషి చేస్తా

### నూతన ఎంపీడీఓ రోజా రాణి

**తొలిసమయం కొత్తగూడ జులై 18**



మండల అభివృద్ధి కీ కృషి చేస్తా నూతన ఎంపీడీఓ రోజా రాణి అన్నారు. కొత్తగూడ మండల నూతన ఎంపీడీవో గా రోజా రాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రవీందర్ ప్రసాద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు బదిలీ కాగా కొన్ని రోజులుగా మండల ఇంచార్జ్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంపీవో రామకృష్ణ.నూతన ఎంపీడీఓ కు బాధ్యత లను అప్పగించారు. రోజా రాణి ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం నుండి కొత్తగూడ మండలం కు కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రోజా రాణి మాట్లాడుతూ..మండల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానని మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ కార్యదర్శిలు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## గంగారం మండల ఎంపీడీవోగా మిర్జా మునవర్ భేగ్

**తొలిసమయం గంగారం జులై 18**



గంగారం మండల ఎంపీడీవోగా మిర్జా మునవర్ భేగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి గంగారం బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన అప్పారావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు బదిలీ అయ్యారు. కొన్ని రోజులుగా ఇంచార్జి ఎంపీడీఓ గా విధులు నిర్వహించిన కొత్తగూడ ఎంపీవో రామకృష్ణ నుంచి నూతన ఎంపీడీవో మిర్జా మునవర్ భేగ్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మిర్జా మునవర్ భేగ్ మాట్లాడుతూ..."మండల అభివృద్ధే లక్ష్యం గా ప్రతి గ్రామ సమస్యలు తెలుసుకుని, మండల ప్రజల, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చర్యలు చేపడతాం అని అన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# ప్రసూతి గృహ సంరక్షణ

### అవంతరాలు లేని గర్భధారణకు భరోసా - వైద్యురాలు దుర్గాభవానిలి



**తొలిసమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక, జూలై 18**

పినపాక మండలం లోని గ్రామంలో గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను ఎంచుకునేలా ప్రోత్సహించడంపై పినపాక ప్రాథమిక వైద్యురాలు దుర్గ భవాని ప్రసూతి గృహ సందర్శన చేపట్టారు.ఆమె గర్భిణీ స్త్రీలకు సురక్షితమైన మాతృత్వం కోసం సంస్థాగత ప్రసవం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రసవానికి ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలపై అవగాహన పెంచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాల గురించి సమాచారం, కౌన్సెలింగ్ అందించడం జరిగింది, నైపుణ్యం కలిగిన వైద్య నిపుణులు, అవసరమైన పరికరాలు, అత్యవసర సంరక్షణ అందు బాటులో ఉన్నాయి అని ఆమె అన్నారు. ఈ చురుకైన విధానం ఆసుపత్రి ప్రసవాల గురి గురించి ఆందోళనలు లేదా అపోహలను పరిష్కరించడానికి ఆశించే తల్లులలో సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుంది అని ఆమె అన్నారు. ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా, ఈ చౌరవ తల్లి మరియు శిశు మరణాల రేటును తగ్గించడం,సమాజంలోనిమహిళలకు సురక్షితమైన దాల్చడం, ప్రసవాలను నిర్ధారించడం జరుగు తుందని ఆమె అన్నారు. ఈ సందర్శనలో గర్భిణీ స్త్రీల ఆరోగ్య స్థితిని అంచనా వేయడం, పోషకాహారం మరియు పరిశుభ్రతపై మార్గదర్శకత్వం అందించడం మరియు గర్భం మరియు ప్రసవం గురించి వారికి ఉన్న ఏవైనా నిర్దిష్ట ఆందోళనలు లేదా ప్రశ్నలను పరిష్కరించడం కూడా ఉండవచ్చు అని ఆమె అన్నారు. ఈ వ్యక్తిగతీకరించిన విధానం మహిళలతో నమ్మకం మరియు సంబంధాన్ని పెంచుకోవడానికి సహాయ పడుతుంది,గర్భిణీ స్త్రీలు సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన ప్రసవ ఎంపికలను ఎంచుకో వడానికి అధికారం పొందారని భావించే సహాయక వాతావరణాన్ని సృష్టించడం మొత్తం లక్ష్యం, చివరికి పినపాకలో మెరుగైన తల్లి మరియు శిశు ఆరోగ్య ఫలితాలకు దోహదపడుతుంది అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ సుష్మ, మెడికల్ ఆఫీసర్, ఆషాలు పాల్గొన్నారు.

# మండలంలో సిపిఐకి తిరుగులేదు

### - గ్రామ గ్రామాన సిపిఐ జెండా ఎగరాలి - సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జులై 18**

లక్ష్మీదేవిపల్లి మండలం లోని హమాలీ కాలనీ నందు సిపిఐ మండల 4వ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చంద్రగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ పార్టీ పురుడు పోసుకున్న గడ్డ లక్ష్మీదేవిపల్లి మండలం అన్నారు. మండలంలో పలు ప్రాంతాల అభివృద్ధికి సిపిఐ పార్టీ నాటి నుండి నేటి వరకు అనేక రకాల పోరాటాలను నిర్వహించి ప్రజల శ్రేయస్సే పరమావధిగా భావించి సమస్యల పరిష్కారం దిశగా పని చేసిందని తెలిపారు. మండలంలో పోడు భూములు, అంబసత్రం భూముల సమస్యల పరిష్కారానికి సైతం భారత కమ్యూనిస్టు పార్టీ ముందుండి ప్రజల పక్షాన నిలబడిందని గుర్తు చేశారు. మండలంలో పలు ప్రాంతాలను సిపిఐ పార్టీ నిర్మించి ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి బాటలు వేసిందని తెలిపారు. మండలంలో ఎటువంటి ఎన్నికలనైనా జయించగలిగే పటిష్టమైన నాయక త్వాన్ని కలిగి ఉందన్నారు. ఈ ప్రాంతం పూర్తి ఏజెన్సీ ప్రాంతమై ఉన్న ఇక్కడి ప్రజల అభివృద్ధికి ఎటువంటి ఆటంకం లేకుండా ప్రజాసేవే ముఖ్యమని భావించే నాయకత్వాన్ని కలిగి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా హమాలి సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ



కార్యక్రమంలో కల్లూరు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్ర నరేంద్ర, సలిగంటి శ్రీనివాస్, వెంకట నరసయ్య, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, గోవిందు,లింగయ్య, రవి, ఉపేందర్, కృష్ణ, రాజు, పూర్ణచందర్ రావు, రాంప్రసాద్, మాధవ్ రావు, కరిష రత్నకుమారి, మామిడాల ధనలక్ష్మి, మంద నిర్మల, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది మంత్రి కొండా సురేఖ


**తొలి సమయం వరంగల్ జూలై 18**

వరంగల్ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎల్బీనగర్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజీ చెక్కులు, కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మహిళల పేరు మీద ఇళ్లను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. 500 రూపాయలకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేద కుటుంబాలకు మద్దతుగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. గత పాలకుల పాలనలో రేషన్ కార్డుల పంపిణీ జరిగితే ఇప్పుడే జరుగుతోందని పేర్కొన్నార ు.కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.



## నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా ఘన నివాళి

**తొలి సమయం18 జూలై 2025 శుక్రవారం. దంతాలపల్లి.**




నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా శుభాకాంక్షలు!ఈ రోజు, జూలై 18, ప్రపంచం "నెల్సన్ మండేలా ఇంటర్నేషనల్ డే"గా జరుపుకుంటోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, బహుజన్ సమాజ్ పార్టీ %-% మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఎడ్ల శ్రీను గారు యువతి యువకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్సన్ మండేలా జీవితానుభవాలు మన బహుజన సమాజానికి, మన యువతకు చిరస్మరణీయ పాఠాలు చెబుతున్నాయి. ఆయన 27 ఏళ్ల జైలు జీవితం, కానీ ఆయనలో ఉన్న ఆశ, సహనం, మానవత్వం కొంచెం కూడా తగ్గలేదు. ఇది ఎంతటి సంక్లిష్ట పరిస్థితులనైనా అద్భుతంగా ఎదుర్కొనగల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. యువతకు సందేశంఅన్యాయాన్ని చూసి మౌనంగా ఉండకండి. మండేలా చెప్పినట్టు, "సామాజిక స్వేచ్ఛ అంటే కేవలం గొంతు స్వేచ్ఛ కాదు, అది ఇతరుల గొంతునూ రక్షించగల ధైర్యం కూడా."సత్యం, సమానత్వం కోసం పోరాడండి కానీ ద్వేషంతో కాదు, దయతో, శాంతితో, న్యాయబద్ధంగా.విద్యను ఆయుధంగా మార్చుకోండి మండేలా అన్నట్టే, »»Education is the most powerful weapon which you can use to change the world.µµ ఈ రోజు మనం మండేలా ఆశయాలను గౌరవిస్తూ, బహుజన సమాజాన్ని అంధకారపు సామ్రాజ్యాల నుండి వెలుగునకు తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగుదాం. జాతి, కుల, వర్గ, మత భేదాలను అధిగమించి ప్రజాస్వామ్యం, న్యాయం, సమానత్వం కోసం యువత కట్టుబడి ఉండాలి అని అన్నారు

## వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న పెద్ద ముప్పారం ప్రజలు

**తొలి సమయం దంతాలపల్లి జూలై 18 2025:**



పెద్దముప్పారం మేజర్ గ్రామపంచాయతీలో ప్రజలు రాత్రి సమయంలో తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పేదవారూ, విద్యార్థులూ, వృద్ధులూ రాత్రివేళ బయటికి రావడానికి భయపడుతున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, స్కూల్ ప్రాంతం, అంగన్‌వాడీ సెంటర్ వద్ద వీధి దీపాల లేని పరిస్థితి ప్రజల రక్షణకు ప్రమాదకరం గా మారింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు గ్రామపంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులకు, వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ధనాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలన్న నిశ్చయంతో వారు ఈ డిమాండ్‌ను తెరపైకి తీసుకువచ్చారు. పెద్దముప్పారం గ్రామ అభివృద్ధి కోసం అన్ని మౌలిక వసతుల కల్పన తప్పనిసరి అని, త్వరితగతిన వీధిలైట్లు ఏర్పాటు చేయకపోతే, ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలకు దిగాల్సి వస్తుందని ప్రజలు హెచ్చరించారు. ప్రజల భద్రతకు, గ్రామ అభివృద్ధికి వీధిలైట్లు అవసరం! పెద్దముప్పారం ప్రజలు కోరుతున్నారు

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101